
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
ఆదివారం 7 జూలై 2024
జిల్లాల వార్తలు





ఐలాపూర్ మళ్లీ కబ్జాల కలకలం



వివాదాస్పద భూములు కొనుగోలు చేయవద్దని ఐలాపూర్ గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

- వివాదాస్పద భూముల్లో అక్రమార్కుల ప్రవేశం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ సిబ్బంది

పటాన్‌చెరు, జూలై 6: వివాదాస్పద ఐలాపూర్ భూముల్లో మళ్లీ కబ్జాదారుల కదలికలు ప్రారంభమయ్యాయి. అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో కోర్టు వివాదంలో నలుగుతున్న భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజగోపాల్‌నగర్‌గా లేఅవుట్ చేసిన స్థలాలను దొడ్డిదారిన కబ్జా చేసి విక్రయించే పనులు ఊపందుకున్నాయి. సదరు భూములపై హక్కుల కోసం రాజగోపాల్‌నగర్ ప్లాట్ల బాధితులు కోర్టులో న్యాయ పోరాటం చేస్తుండగానే.. అసైన్‌మెంట్‌దారుల పేరిట భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఐలాపూర్ గ్రామంలో సర్వే నంబర్ 1 నుంచి 220 వరకు ఉన్న సర్వే నంబర్లలోని వందల ఎకరాల భూములపై హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వం మరో వైపు ప్లాట్ల యజమానులు, గ్రామ రైతులు భూములు తమకే చెందాలని న్యాయపోరాటం చేస్తున్నారు. ఇదే అదనుగా వివాదాస్పద భూములను ఆక్రమించి సొమ్ము చేసుకునే ల్యాండ్ మాఫియా ముఠాలు రంగంలోకి దిగాయి. గతంలో వివాదాస్పద భూముల్లో ప్లాట్లు చేసి నోటరీల ద్వారా విక్రయించి కోట్లాది రూపాయలు దండుకున్న భూ మాఫియా అధికారుల చర్యలతో కొద్దిరోజులు స్తబ్దుగా ఉన్నది. కానీ, ఇటీవల పలు సర్వే నంబర్లలో నాట్ టు ఎంటర్ ఫియర్ పేరుతో కోర్టు డిక్రీని చూపిస్తూ భూములను చదును చేస్తున్నారు.



ఐలాపూర్ భూములను చదును చేస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు

గతంలో కూల్చివేతలు

గతంలో ఇదే గ్రామంలో నోటరీల ద్వారా ప్లాట్లు కొనుగోలు చేసి నిరుపేదలు కట్టుకున్న వందల ఇళ్లను రెవెన్యూ సిబ్బంది కూల్చివేయడం వివాదాస్పదమైంది. మరోసారి నోటరీ ద్వారా ప్లాట్ల విక్రయానికి సిద్ధమవుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఆ భూములను చదును చేస్తున్నారన్న సమాచారంతో అమీన్‌పూర్ డిప్యూటీ తహసీల్దార్ బాల్‌రాజ్ సంఘటనా స్థలానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. కాగా, ఐలాపూర్‌లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సమగ్ర నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ షురూ

- నాలుగేళ్ల సీనియారిటీ పూర్తిచేసుకున్నవారి వివరాల సేకరణ
- జిల్లాలో 647 గ్రామపంచాయతీలు, 639 మంది కార్యదర్శులు

సంగారెడ్డి టౌన్, జూలై 6 : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 80 ప్రకారం జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం పంచాయతీ కార్యదర్శుల వివరాలు సేకరిస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాలుగేళ్ల సీనియార్టీ పూర్తయిన జాబితాను మండల పరిషత్ అధికారుల నుంచి సేకరిస్తున్నారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 5న ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను 20వ తేదీ లోపు పూర్తి చేయనున్నారు. ఈ నెల 8 వరకు జిల్లాలో నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన పంచాయతీ కార్యదర్శుల వివరాలు సేకరించనున్నారు. 9 నుంచి 12వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. 13 నుంచి 18 వరకు దరఖాస్తులను పరిశీలన పూర్తిచేసి ప్రాధాన్యత జాబితాను ప్రకటించనున్నారు. 19, 20 తేదీలలో బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు అందజేస్తారు.

జిల్లాలో 639 మంది కార్యదర్శులు

సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలుండగా 639 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 428 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కాగా.. 347 మంది రెగ్యులరైజ్ అయ్యారు. గ్రేడ్-1 కార్యదర్శులు 25 మంది, గ్రేడ్-2 కార్యదర్శులు 21, గ్రేడ్-3 కార్యదర్శులు 120, గ్రేడ్-4 కార్యదర్శులు 45 మంది ఉన్నారు. కాగా 1 గ్రేడ్ నుంచి 3 గ్రేడ్ వరకు రాష్ట్ర స్థాయిలో బదిలీలు చేస్తారు. గ్రేడ్-4, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జిల్లాస్థాయిలో చేపట్టనున్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వెంకట్

మెదక్ అర్బన్, జూలై 6: పెంపుడు జంతువులతో అప్రమత్తంగా ఉండాలని మెదక్ పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.వెంకట్ సూచించారు. వీటి ద్వారా సోకే వ్యాధుల్లో చాలావరకు ప్రాణాంతకమైనవి ఉన్నాయని పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశు వైద్యశాలలో ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకా శిబిరంతో పాటు కుక్కల పెంపకందారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 120 పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. వారంరోజుల పాటు టీకా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా.లక్ష్మణ్, జేవీవో సల్లావొద్దీన్, గోపాల్, ఎల్ఎస్ఏ శివాజీ, వీఏలు రాకేష్, భానుచందర్, ఓఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.




పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డా.వెంకట్

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

జిన్నారం, జూలై 6: మండల కేంద్రం జిన్నారంలో కోర్టు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన ఐకేపీ భవనాన్ని జిల్లా న్యాయాధికారి భవానీ చంద్ర శనివారం పరిశీలించారు. భవనంలో కోర్టు ఏర్పాటుకు ఉన్న వసతులను తెలుసుకున్నారు. కాగా న్యాయమూర్తికి తహసీల్దార్ భిక్షపతి, సీఐ సుధీర్‌కుమార్, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయరావు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఏర్పాటు కోసం భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి భవానీచంద్ర, అధికారులు, న్యాయవాదులు



ఆర్టీసీ బస్సు ఢీ, బాలుడికి గాయాలు

నర్సాపూర్, జూలై 6: నర్సాపూర్ బస్టాండు వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో బాలుడి(10) కాలుకు తీవ్ర గాయమైంది. మెదక్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నర్సాపూర్ బస్టాండ్‌లోకి వెళ్తున్నది. అదే సమయంలో కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన తేజ్(5) బాలుడు రోడ్డు దాటుతుండగా.. బస్సుకు తగిలాడు. దీంతో కాలుకు తీవ్ర గాయమైంది. బస్టాండ్‌లో బస్సును ఆపి బాలుడిని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని స్థానికులు డ్రైవర్‌ను ఒత్తిడి చేశారు. దీంతో బాలుడిని తీసుకెళ్లి చికిత్స చేయించాడు.





బోరు బావిలో పడి వ్యక్తి మృతి





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్వామి(ఫైల్)

నిజాంపేట, జూలై 6: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి బోరు బావిలో పడి మృతిచెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటు చేసుకున్నది. రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన కొంతలపల్లి స్వామి(43) మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. ఆరురోజుల క్రితం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ దుబ్బాక మండలం పోతారెడ్డిపేటలోని అక్క వద్దకు పోయాడు. అక్కడ బోరు బావి వద్దకు వెళ్లి అందులో పడి చనిపోయాడు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్, జూలై 6: స్థలం విషయంలో న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్(40) తన ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలం విషయంలో మరొకరితో వివాదం కొనసాగుతోంది. ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అక్కడ కూడా న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన మల్లేష్ ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించినట్లు తెలిపారు.

ప్రతీ గ్రామంలో జ్వర సర్వే నిర్వహించాలి

- డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష




మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష

సంగారెడ్డి అర్బన్, జూలై 6: వర్షాకాలంలో జ్వరాలు నమోదయ్యే అవకాశం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రతీ గ్రామంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేసి జ్వర సర్వే నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డా.శిరీష సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజరీ సిబ్బంది ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం మొత్తం ప్రతి రోజు డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటింటి సర్వేచేసి అన్నిరకాల ఆరోగ్య సమస్యలపై ఆశాలు ఆరాతీసి నివేదిక సమర్పించాలన్నారు. తాగునీటి పైపులైన్ లీకేజీలను గమనిస్తే వెంటనే పంచాయతీ సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.ప్రవీణ్, సహాయ మలేరియా అధికారి శ్రీరాంసుధాకర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి

మెదక్ అర్బన్, జూలై 6: పరిపాలన ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో సోమవారం నుంచి జిల్లాలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నట్లు మెదక్ రెవెన్యూ డివిజినల్ అధికారి రమాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ప్రజలు ఆయా మండలానికి సంబంధించిన సమస్యను ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు రూపంలో అందజేయాలన్నారు. భూ సమస్యలు పరిష్కారానికి ధరణి ఏ మాడ్యూల్‌పై దరఖాస్తు చేయాలనే అంశంపై తహసీల్దార్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో, మీసేవా కేంద్రాల్లో ప్రజలకు తెలిసే విధంగా తెలుగులో స్పష్టంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తహసీల్దార్లు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉదయం 10:30 నుంచి 2:30 గంటల వరకు ప్రజావాణి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మండలస్థాయిలో ప్రజావాణి నిర్వహించడంతో ప్రజలకు దూరభారంతో పాటు వ్యయ ప్రయాసలు తగ్గనున్నాయని ఆమె పేర్కొన్నారు.



గిరిజనుల భూములను పరిరక్షించాలి

సంగారెడ్డి రూరల్, జూలై 6 : జిల్లాలో ఎస్టీల ఆధీనంలో ఉన్న భూములను పరిరక్షించేందుకు ఆర్డీవో, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేయాలని డీవీఎంసీ సభ్యుడు దుర్గాప్రసాద్ అధికారులను కోరారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూములు కోల్పోయినవారు ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'ధరణి' స్పెషల్‌డ్రైవ్‌లో 5వేల దరఖాస్తులకు మోక్షం

- జిల్లాలో ఇంకా 6వేల అప్లికేషన్లు పెండింగ్
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూలై 6: జిల్లాలో ధరణి స్పెషల్ డ్రైవ్‌లో 5వేల దరఖాస్తులు పరిష్కరించామని, మరో 6వేల దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో ధరణి సమస్యల పరిష్కారంపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను 20 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై సమీక్షిస్తూ.. అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపడితే నష్టపోతారని, అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే నిర్మాణాలు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు నర్సాపూర్ బస్టాండ్‌ను రాహుల్‌రాజ్ సందర్శించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తవేయడంపై అసహనం వ్యక్తం చేశారు. మూత్రశాలలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. మహిళలతో మాట్లాడి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ సమీపంలో కుంట పూడ్చడంతో సమీపంలోని కాలనీలోకి వరద నీరు చేరుతున్న విషయంపై ఆరా తీశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం నర్సాపూర్‌లోని పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు, తహసీల్దార్ కమలాద్రి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, పీఆర్ డీఈఈ రాధిక, మున్సిపల్ కమిషనర్ జైతురాంనాయక్, ఏఈ స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు



నర్సాపూర్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూలై 6 : పెంపుడు జంతువులకు పశువైద్య కేంద్రాల్లో ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సినేషన్‌ను శనివారం ఆమె సంగారెడ్డిలో ప్రారంభించారు. జిల్లాకేంద్రంలో వెయ్యి కుటుంబాలు జంతువులను పెంచుకుంటున్నాయని, వీరందరూ రేబిస్ వ్యాక్సిన్‌ను తప్పకుండా వేయించాలని ఆమె సూచించారు. పెంపుడు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వెటర్నరీ విభాగం అధికారులను ఆదేశించారు.



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

అధ్వానంగా అంతర్ జిల్లా రహదారి

● గుంతలమయంగా మారిన వెంకటాపూర్ రోడ్డు ● రెండేళ్ల క్రితమే రూ. 3.30 కోట్లు మంజూరైనా సాగని పనులు

కోహీర్ జూలై 6: మండలంలోని 65వ నంబర్ జాతీయ రహదారి నుంచి వెంకటాపూర్ గ్రామం మీదుగా వయా పోతిరెడ్డిపల్లి నుంచి వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి మండలానికి అనుసంధానంగా ఉన్న ప్రధాన తారు రోడ్డు పాడైపోయి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అంతేగాకుండా ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు వివిధ గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు జరిపించాలని పలుమార్లు మండల, జిల్లా అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. పాడైపోయిన వెంకటాపూర్ రహదారిని మాత్రం బాగు చేయలేకపోతున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ గాయాలబారిన పడుతున్నారు. ఇక గుంతల కారణంగా కార్లు లారీల చక్రాలు దిగబడి పాడవుతున్నాయి. ఆటో రిక్షావాళ్లు ఆ ఊరికి రావడమే మానేశారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఈ రోడ్డుపై గుంతల కారణంగా కార్లు, ద్విచక్రవాహనాలు నిదానంగా వెళ్లాల్సివస్తున్నది. దీంతో వారం రోజుల క్రితం దారి దొంగలు ఓ కారును ఆపి కారు యజమానిని కొట్టి అతడి వద్ద ఉన్న డబ్బులు దొంగిలించినట్లు వెంకటాపురం గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడైపోయిన రోడ్డును బాగు చేస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.


వెంకటాపూర్ ప్రధాన తారు రోడ్డు దుస్థితి

రెండేళ్ల క్రితమే నిధులు

పాడైపోయిన వెంకటాపూర్ రోడ్డును బాగు చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో రూ.3.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయితే టెండర్ ఖరారు కావడంలో ఆలస్యం కావడం, అంతలోనే శాసనసభ, పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు పనులు ముందుకు సాగలేదు. అంతేకాకుండా ప్రస్తుతం గతంలో కంటే ఇప్పుడు ధరలు పెరగడంతో రోడ్డు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని తెలిసింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రస్తుత ధరలకనుగుణంగా ఎస్టిమేషన్‌ను రూపొందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు పనులను పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్టోన్ క్రషర్ పనులు నిలిపి వేయాలి


జిన్నారంలో డీటీకి ఫిర్యాదు చేస్తున్న రాళ్లకత్వ గ్రామస్థులు

జిన్నారం, జూలై 6: రాళ్లకత్వ గ్రామ శివారులో నూతన స్టోన్ క్రషర్ ఏర్పాటు పనులు నిలిపివేయాలని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం జిన్నారంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునస్వామిని రాళ్లకత్వ గ్రామ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. స్థానిక 286 సర్వే నెంబరులో అసైన్డ్ భూమిలో స్టోన్ క్రషర్ ఏర్పాటు పనులు చేపట్టారని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులు నిలిపి వేయాలని ఫిర్యాదు చేశారు కార్యక్రమంలో నాయకులు ఆదిరామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు. కాగా మాదారం శివారు సర్వే నెంబరు 210లోనూ క్రషర్, క్వారీల ఏర్పాటు అనుమతులు నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. శనివారం మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానికులతో సమావేశం నిర్వహించారు. క్రషర్ ఏర్పాటు పనులు చేపడితే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

కేతకీ హుండీ ఆదాయం రూ.19.50 లక్షలు

ఝరాసంగం, జూలై 6: శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 45 రోజులకుగాను హుండీ ఆదాయం రూ, 19.50 లక్షలు సమకూరినట్టు ఆలయ ఈవో శశిధర్ తెలిపారు. రాజరాజేశ్వరీ సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగిందన్నారు. కార్యక్రమంలో బిడెంపేట ఆలయ ఈవో శివరుద్రప్ప స్వామి, ఆలయ సిబ్బంది శివస్వామి, రమేష్, పోలీసులు, అర్చకులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కంది, జూలై 6: ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి సీతక్క కార్యాలయంలో శనివారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కలిశారు. 317 జీవో ద్వారా వేర్వేరు జిల్లాల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీలపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులను తిరిగి సొంత జిల్లాలకు పంపాలని, ఉమ్మడి మెదక్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతుల విషయంలో గతంలో అన్యాయం జరిగిందని, వెంటనే పునరుద్ధరించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు రాష్ట్ర నాయకులు మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఎంఎస్ఎస్ వాణిలు తెలిపారు.


రేగోడు: దోసపల్లిలో అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న వైద్య అధికారి, అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీల్లో చిన్నారులకు బరువు పరిశీలన

రేగోడు జూలై 6: అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి ఝూన్సీ తెలిపారు. శనివారం రేగోడు మండలంలోని దోసపల్లి 1వ, 2వ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బరువు ఎదుగుదలను పరిశీలించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు జయలక్ష్మీ, అనిత, సిబ్బంది సంగమ్మ, బుజ్జమ్మ ఏఎన్ఎం రాణి, ఐకేపీ సీఏ పీరారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం


మునిపల్లి: ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి


కంది: ఎద్దుమైలారం పాఠశాలలో బదిలీ అయినవారిని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మునిపల్లి, జూలై 6: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంతారం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడు చంద్రయ్య పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం కంకోల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై పదవీ విరమణ పొందిన చంద్రయ్య దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మండల అధ్యక్షుడు చంద్రమౌళి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆకుల ప్రభు, ఎంఈవో దశరథ్, జిల్లా నాయకులు మాణ య్య, దేవిసింగ్, సాబేర్ అలీ, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కంది, జూలై 6 : కంది మండలపరిధిలోని ఎద్దుమైలారంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఇంతకాలం పని చేసి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ఉపాధ్యాయులను ఆ పాఠశాల విద్యార్థులతో పాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో శనివారం హెచ్ఎం జోగప్ప బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు ప్రకాశ్, రెబ్కా, శ్రీలక్ష్మీ, రీనా, హన్మయ్య, ప్రశాంత్‌లకు శాలువాలు, పూలదండలతో సన్మానం చేసి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు హరికృష్ణ, శైలజ, రెహెలమ్మ, విజయలక్ష్మి, నర్సింహులు, సరస్వతి, పద్మావతి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


సంగారెడ్డిలోని సాహితి ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న సిద్ధాంతి, ఎండీ రాము

సంగారెడ్డి అర్బన్, జూలై 6: రక్తదానం ప్రాణదానంతో సమానమని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మసిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డిలోని సాహితి ఆస్పత్రిలో ఎండీ రాము సాహితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ సిద్ధాంతి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రి ఎండీ రాము సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కాగా ఈ శిబిరంలో సుమారు 120 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కోనేరు చందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో సీజనల్ వ్యాధులపై ఉచిత క్యాంపు

మనోహరాబాద్, జూన్ 6: మండలంలోని కొండాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచితక్యాంపును నిర్వహించారు. క్యాంపులో మండల వైద్యాధికారి వికాస్, డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అందజేసి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


శివ్వంపేట: పెద్ద గొట్టిముక్కల పాఠశాలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట, జూలై 6: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కృషి చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. శనివారం 'ఏక్ పేడ్.. మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా పెద్దశంకరంపేటలో ప్రదేశాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలను నాటారు. కాగా మండలపరిధిలోని చీలపల్లి, బుజ్రాన్‌పల్లి, గొట్టి ముక్కుల , జూక్కల్, ఆరేపల్లి, మూసాపేట్, బూర్గుపల్లి, లక్ష్మాపూర్, కమలాపూర్, ఆయా గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు నాయకులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు సూర్యప్రకాష్, శ్రావణ్‌కుమార్, మంగలి క్రిష్ణ, బుగుడాల క్రిష్ణ, సుభాష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పాపన్నపేట: ప్రధాని పిలుపు మేరకు 'ఏక్ పేడ్.. మాకే నామ్' పేరిట బీజేపీ నాయకులు, కార్యకర్తలు, శనివారం పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వి.బాగేష్, బి.నాగరాజు, చిన్న, దుర్గయ్య, రత్నయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

● నిజాంపేట: ప్రధాని మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గేరుగంటి బాబు, ఆముద రాజు పాల్గొన్నారు.

● శివ్వంపేట: మండల పరిధిలోని పెద్ద గొట్టుముక్కల గ్రామంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రఘువీరారెడ్డి హాజరై స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దపల్లి రవి, బీజేవైఎం మండల అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి చెక్కు పంపిణీ


మృతుడి కుటుంబానికి చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి

హత్నూర, జూలై 6: మండలంలోని చందాపూర్ ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతులమీదుగా పరిశ్రమ ప్రతినిధులు శనివారం చెక్కు అందజేశారు. మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి విష్ణు పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పరిశ్రమ యాజమాన్యం ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. రూ.26లక్షల చెక్కును మృతుడి భార్యకు మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా అందజేశారు.

నేడు అమీన్‌పూర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పటాన్‌చెరు, జూలై 6: అమీన్‌పూర్ మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 6 నుంచి 9గంటల వరకు నిరవధికంగా మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఆర్.వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం 132కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసరన మరమ్మతుల నిర్వహణ సందర్భంగా అమీన్‌పూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో ఎస్టీలకు వసతి

సంగారెడ్డి అర్బన్, జూలై 6: సంగారెడ్డి జడ్పీ ఆఫీస్ వెనకాల ఉన్న గిరిజన మహిళా ఉద్యోగినుల వసతి గృహంలో ఉండేందుకు ఎస్టీ వర్కింగ్ మహిళలకు అవకాశం కల్పిస్తున్నట్లు వార్డెన్ షాహెదా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం వసతి మాత్రమే కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే గిరిజన ఉద్యోగినులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8309063751 ఫోన్ నంబరుకు సంప్రదించాలని ఆమె కోరారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం


సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో శ్యామప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్/మనూరు/జహీరాబాద్, జూలై 6: జనసంఘ్ వ్యవస్థాపకుడు డా.శ్యామప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి కొనియాడారు. శనివారం డా.శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మనూరు మండలం మాయికోడ్ గ్రామంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి పాల్గొని మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కార్యక్రమాల ఇన్‌చార్జి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, అధికార ప్రతినిధి డా.రాజు గౌడ్, మనూరు మండల అధ్యక్షుడు ఈశ్వరప్ప, నాయకులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, నాయకులు అనితాపాటిల్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

● మెదక్ అర్బన్/పెద్ద శంకరంపేట/నర్సాపూర్, జూలై 6: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కొనియాడారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో డా. శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వీణ, నాయకులు పాల్గొన్నారు. పెద్దశంకరంపేట బీజేపీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శ్యామప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

సంగారెడ్డి అర్బన్, జూలై 6: ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం బాబుజగ్జీవన్‌రామ్ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని బాబుజగ్జీవన్ విగ్రహానికి ఫోరమ్ ఫర్ బెటర్ అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాడిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. బాబుజగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సజ్జద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మహేశ్, సహకార్యదర్శి శ్రీకాంత్, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

● వట్‌పల్లి: మండలంలోని యువజన సంఘాలు, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బాలరాజ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

● జహీరాబాద్: పట్టణంలో వివిధపార్టీలు, అభిమాన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన నాయకులు పస్తాపూర్‌లో బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రాం చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయసాధన దిశగా మనందరం నడుచుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, అరుంధతిసంఘం నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్: పస్తాపూర్‌లో విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు

రాంపూర్ పెద్దమ్మ ఆలయంలో చోరీ

అల్లాదుర్గం, జూలై 6: మండలంలోని రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి పక్కన గల పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం రాత్రి ఆలయ పూజారి ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం ఆలయానికి పూజారి వచ్చేసరికి హుండీ పక్కన పడేసి ఉంది. అనుమానంతో పరిశీలించగా హుండీలో భక్తులు వేసిన వెండి నగలతో పాటు నగదును కూడా అపహరించుకుపోయినట్లు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ భర్త బలరాంరెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో చోరీ ఘటనపై ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

నలుగురు పేకాట రాయుళ్లపై కేసు

మనోహరాబాద్ జూన్ 6: మండలంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి నలుగురు పేకాటరాయుళ్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జీడిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పేకాడుతున్నట్టు పోలీసులకు సమాచారమందింది. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ. 22,460 నగదు, 3 సెల్‌ఫోన్లు, పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళలు, బాలికల సాధికారతపై అవగాహన


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, జూలై 6: సంగారెడ్డిలోని అంబేడ్కర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహిళలు, బాలికల సాధికారతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికారసంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మిషన్ శక్తి 100 రోజుల స్పెషల్ అవగాహన కార్యకమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ హాజరై మాట్లాడారు. మానవ, ఆడపిల్లల హక్కులు, విద్యాప్రాముఖ్యత, కొత్తగా ఏర్పడిన న్యాయ చట్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, పట్టణ సీఐ భాస్కర్, డీసీపీవో రత్నం, మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ పల్లవి, కళాశాల ప్రిన్సిపాల్ ధారాసింగ్, రవీంద్రనాథ్, సుమ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సంగారెడ్డి రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఎంఎన్ఆర్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్' శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జూలై 6: విద్యారంగంలో నూతనోద్యమాన్ని చూపించే లక్ష్యంతో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో రోబోటిక్స్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇస్నాపూర్ జడ్పీహెచ్ఎస్, సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్, తొగర్‌పల్లి జడ్పీఉన్నత పాఠశాలలో 8,9 వ తరగతులకు సుమారు 650 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం వ్యవస్థాపకులు కోమరగిరి సహదేవ్ మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి తెలంగాణా వ్యాప్తంగా 14 జిల్లాల్లో 230 పాఠశాలల్లో 34,571 మంది విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, సీఎంవో వెంకటేశం, ఏఎంవో అనురాధ, డీఎస్‌వో సిద్దారెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో ఊరికి ఉపకారం


మురుగు కాలువల పనులు ప్రారంభిస్తున్న ప్రసాద్‌రెడ్డి

కోహీర్ జూలై 6: సొంత ఊరికి మంచి చేయాలన్న ఉద్దేశంతో మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి సొంత డబ్బు వెచ్చించి గ్రామంలో దాదాపు 500 మీటర్ల మురుగు కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఉదారతను చాటుకున్నాడు. గ్రామంలో సరైన మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించిన ప్రసాద్‌రెడ్డి రూ.7 లక్షలు తన సొంత నిధులతో గ్రామంలో మురుగు కాలువ నిర్మాణానికి సంకల్పించాడు. ఈ మేరకు శనివారం మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. అంతేకాకుండా ఇటీవల గ్రామంలో తాగునీటి కోసం మూడు బోరుబావులను సొంత ఖర్చుతో తవ్వించారు. గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకార అందిస్తూ పలు అభివృద్ధి పనులు చేపడుతున్న ప్రసాద్‌రెడ్డిని సజ్జాపూర్ గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి ఏవో నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మైసయ్య ఉన్నారు.

పన్నులు చెల్లించి పట్టణ ప్రగతికి సహకరించండి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్, జూలై 6: పట్టణ ప్రజలు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో బిల్‌కలెక్టర్‌లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టాలన్నారు. పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన చెప్పారు.

కేంద్రమంత్రిని కలిసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు


కేంద్రమంత్రి బండిసంజయ్‌తో రమేష్‌గౌడ్

నర్సాపూర్, జూలై 6: కేంద్ర మంత్రి బండిసంజయ్‌ను కలిసి నర్సాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు వచ్చేలా చూడాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.చిన్నరమేష్‌గౌడ్ తెలిపారు. శనివారం డిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన బండిసంజయ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలన ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ డిగ్రీ విద్యార్థులు

నర్సాపూర్, జూలై 6: హైదరాబాద్‌లో వ్యవసాయ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శనివారం మండలంలోని లింగాపూర్‌లో పర్యటించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాపూర్‌కు చెందిన శంకర్ అనే రైతు డ్రం సీడర్‌తో వరి విత్తే పద్ధతిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు అఖిల్, అశోక్, మౌనిక, రిషిక, మనిదీప్, వ్యవసాయ విస్తరణ అధికారి దుర్గాప్రసాద్‌తో పాటు స్థానిక రైతులు పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో 10 రద్దు చేయండి

సంగారెడ్డి రూరల్, జూలై 6 : అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం కలిగించే జీవో 10ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, మంగ, నాయకులు ఇందిరా, గౌరమ్మ, కవిత, షేకమ్మ, లక్ష్మీ, సంగీత, ఏసుమణి తదితరులు పాల్గొన్నారు.

● నారాయణఖేడ్: అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో 10ను రద్దు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంతబాధ్యుడు నల్లవల్లి రమేష్ పేర్కొన్నారు. శనివారం ఖేడ్‌లో డివిజన్‌స్థాయి అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ ప్రయోజనాల కింద అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, సహాయకులకు రూ.లక్ష చొప్పు ఇవ్వాలన్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు అందించాలన్నారు. వాటిని అమలుచేయకుంటే ఉద్యమం తప్పదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.